క్లుప్తంగా

మావుళ్లమ్మకు బంగారం బహూకరణ



మావుళ్లమ్మవారికి బంగారం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మకు ఉప్పులూరుకు చెందిన యర్రా సాయి మేఘనాథ్ కుటుంబసభ్యులు 8 గ్రాముల బంగారం బహూకరించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి ప్రసాదం, రసీదు అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆక్వా సదస్సుకు తరలిన రైతులు



భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: రొయ్య రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని, వీరవాసరం మండల ప్రాన్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్ల రాంబాబు తెలిపారు. పాలకొల్లులో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఆక్వా రైతు సదస్సుకు వీరవాసరం మండల ప్రాన్ ఫార్మర్స్ ఆధ్వర్యంలో బుధవారం భారీ మోటార్ సైకిల్ ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా రైతుల అభివృద్ధి కోసం, రొయ్యల సాగులో కష్ట నష్టాలకు సంబంధించిన అంశాలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో భోగిరెడ్డి శ్రీనివాసరావు, గుండా నరసింహారావు, ఎరక రాజు హరిబాబు, వీరవల్లి చంద్రశేఖర్, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

లాటరీలో రైతుకు వెండి బహుమతి



రైతు కనకరత్నంకు వెండి బహుమతి అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): గత రబీ సీజన్‌లో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన గ్రోమోర్ రైతు సంబరాల్లో భాగంగా గ్రోమోర్ ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు లాటరీ నిర్వహించారు. ఈ లాటరీలో పెనుమంట్ర మండలం మల్లిపూడి గ్రామానికి చెందిన కొడమంచిలి కనకరత్నానికి 50 గ్రాముల వెండి బహుమతిగా లభించింది. ఈ బహుమతిని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి సీహెచ్ డీవీ గుప్తా, కోరమాండల్ మేనేజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్వీఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



ఎస్వీ రంగారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

వీరవాసరం: విశ్వ నట చక్రవర్తి ఎస్వీ రంగారావు 106వ జయంతి ఉత్సవాలను బుధవారం వీరవాసరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ఉత్తమ ఉపాధ్యాయుడు వంగ నరసింహారావు మాట్లాడుతూ నటనా రంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఎస్వీ రంగారావును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముందుగా ఎస్వీ రంగారావు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో గుండా రామకృష్ణ, అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, శ్రీనివాస్, చవాకుల సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి

ఉండి: లయన్స్ క్లబ్ 2024–25 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మీ, కన్నెంగంటి రూత్‌కళ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం నూతన కమిటీ అధ్యక్షుడిగా సత్తి బ్రహ్మారెడ్డి(వాండ్రం), కార్యదర్శి ముదునూరి శివరామరాజు (ఉండి), కోశాధికారి పాలతీర్థపు నర్సింగరావు (ఎన్నార్పీ అగ్రహారం) ఎన్నికైనట్లు తెలిపారు. వీరితో పాటు ఉపాధ్యక్షుడిగా గాదిరాజు రంగరాజు, ప్రముఖ పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి క్లబ్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. క్లబ్ ఎల్‌సీఎఫ్‌సీ కో ఆర్డినేటర్‌గా సాగిరాజు సాంబశివరాజు, రిపాలన అధికారిగా రుద్రరాజు నరసరాజు, ఎన్నికయ్యారు. క్లబ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం త్వరలోనే నిర్వహిస్తామని వారు తెలిపారు.

మెకానిక్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి



ఉండిలో మెకానిక్ డే వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



ఆకివీడులో గురువులను సత్కరించుకున్న మెకానిక్‌లు

ఘనంగా ప్రపంచ మెకానిక్ డే

ఉండి: మెకానిక్‌ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఉండి మోటార్ సైకిల్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బొర్రా ఉమామహేశ్వరరావు, ఆకుల గోపాలకృష్ణ అన్నారు. బుధవారం ప్రపంచ మెకానిక్ డే సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉండిలో కేక్ కట్ చేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో వేగంగా ముందకు సాగాలంటే వాహనాలు చాలా అవసరమని ముఖ్యంగా ద్విచక్ర వాహనాలతో కోట్లాది మంది ప్రయాణాలు సాగిస్తున్నారన్నారు. అవి ఎక్కడా ఆగిపోకుండా మోటార్ సైకిల్ మెకానిక్‌లు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అటువంటి వారికి ప్రభుత్వాలు అన్ని విధాల సహకరించి వారి పురోభివృద్ధి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని టూవీలర్ మెకానిక్‌లకు కార్మికశాఖ ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం టూవీల్స్ బోర్డును ఏర్పాటు చేయాలని అన్నారు.బోర్డు ద్వారా అర్హులైన వారికి వైద్య సాయం, ప్రమాద బీమా, ఆర్థిక సహాయం అందించాలన్నారు. కార్మిక శాఖ ద్వారా గుర్తింపు పొందిన మెకానిక్‌లకు వడ్డీలేని రుణం రూ.3 లక్షల వరకు సబ్సిడీపై అందించాలని కోరారు. ప్రతీ జిల్లా కేంద్రంలో మెకానిక్ సంక్షేమ భవన నిర్మాణానికి కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. కోశాధికారి ముంగండ శ్రీనివాసరావు, కార్యదర్శి ఆకుల సతీష్, గుల్ల అప్పన్న, గోలి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఒక మెకానిక్ ఇంజనీర్‌తో సమానం

భీమవరం (ప్రకాశంచౌక్): ఒక మెకానిక్ ఇంజనీర్‌తో సమానమని, ఎంతో ఆలోచనశక్తి ఉన్న వ్యక్తులే మెకానిక్‌లు అవుతారని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ప్రపంచ మెకానిక్స్ డే కార్యక్రమాన్ని మోటార్ సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కిషోర్ థియేటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్లు కోళ్ల నాగేశ్వరరావు, ఇందుకూరి రామలింగరాజు, చిలుకూరి నరసింహరాజు, మెరగాని నారాయణమ్మ, అసోసియేషన్ అధ్యక్షులు బందెల హనుమంత్, కార్యదర్శి ముమ్మన విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆధునిక సామగ్రితో మెకానిజం చేయాలి

ఆకివీడు: మెకానికర్లూ ఇంజనీర్లేనని, ఆధునిక సామగ్రితో మెకానిజం చేయాలని స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు అన్నారు. ప్రపంచ మెకానిక్స్ డేను స్థానిక మెకానికర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో మెకానిక్ షాపులు పెట్టుకొని జీవనం సాగిస్తున్న మెకానికర్లకు ప్రపంచ మెకానిక్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. సంఘ అధ్యక్షుడు మరడాని సుబ్బారావు మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా మెకానికర్లు సంఘాలను ఏర్పాటు చేసుకొని, సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. ఆకివీడులో సంఘ భవన నిర్మాణానికి తమ వంతు సహకారం అందజేస్తామని, స్థలం కోసం ప్రయత్నం చేద్దామని అతిథులు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా రూ.30 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మహ్మద్ ఇంతియాజ్, ఉపాధ్యక్షుడు మహ్మద్ జావీద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లపై చెట్లు, కొమ్మలు తొలగించుటకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ వార్షిక మరమ్మతులు కూడా చేపట్టుటకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. రామాయణపురం, దిరుసుమర్రు, ఇండస్ట్రియల్ లైన్లకు ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చేతివృత్తుల వారికి అండగా నిలవాలి

ఉండి: చేతి వృత్తుల వారికి ప్రభుత్వం అండగా నిలవాలని నాయీబ్రాహ్మణుల సంఘం ఉండి నాయకులు అన్నారు. ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజును బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తన వంతు సహకారం మీకందిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు నాయకులు మల్లువలస హరికృష్ణ,కార్యదర్శి మల్లువలస హరీష్ తదితరులు తెలిపారు.

విద్యా కిట్ల పంపిణీ

భీమవరం అర్బన్: మండలంలోని అనాకోడేరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూప్రభుత్వం మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తెలుగు భాషకు వెంకటావధాని సేవలు ప్రశంసనీయం



యండగండిలో ఆచార్య వెంకటావధాని జయంతి వేడుకలను నిర్వహిస్తున్న గ్రామ ప్రముఖులు

ఉండి: తెలుగుకు భాష కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన ప్రముఖమైన వారిలో ఆచార్య దివాకర్ల వెంకటావధాని ఒకరని, ఆయన సేవలు ప్రశంసనీయమని యండగండి కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ కార్యదర్శి చెరుకువాడ రవి కుమార్ అన్నారు. బుధవారం వెంకటావధాని 112వ జయంతి వేడుకలను యండగండిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన శత జయంతి వేడుకల సందర్భంగా మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు ఏర్పాటు చేసిన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తెలుగు సాహితీ సంపదను ప్రపంచానికి అందించిన మహోన్నత వ్యక్తి వెంకటావధాని అని అన్నారు. ఆయన యండగండి వాసి కావడం తమకు చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వేగేశ్న రామరాజు, దామర్తి అప్పారావు, దండు సూర్యనారాయణ రాజు, పేరిచెర్ల సత్యనారాయణరాజు, జర్నలిస్టు బంగార్రావు, కన్నా శివన్నారాయణ, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఆవులకు వ్యాక్సిన్



సిద్ధాపురంలో ఆవుకు వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ కె.జనార్ధన్‌రావు

ఆకివీడు: ఆవులను రక్షించుకునేందుకు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టిందని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు కె.జనార్ధన్‌రావు తెలిపారు. మండలంలోని సిద్ధాపురంలో ముద్ద చర్మ వ్యాధి నివారణకు, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ ఇటీవల ఆవులకు లంపీ స్కిన్ డిసీజ్ (ముద్ద చర్మ వ్యాధి) ఎక్కువగా వస్తుందన్నారు. సకాలంలో వైద్యం అందక, వ్యాధి తీవ్రతతో ఆవులు, దూడలు చనిపోతున్నాయన్నారు. వాటి రక్షణ కోసం ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాక్సిన్ అందజేస్తున్నామని చెప్పారు. ఈ వ్యాధి రాకుండా 4 నెలల దూడ నుంచి పెద్ద ఆవుల వరకూ టీకాలు వేస్తున్నామన్నారు. నెల పొడవునా ఆయా గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి వ్యాక్సిన్ అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల పశు సంవర్ధకశాఖ అధికారిణి భార్గవీ సత్య, రైతు నాయకుడు బీహెచ్.తిమ్మరాజు, రైతులు పాల్గొన్నారు.

చురుగ్గా నాలుగులైన్ల రహదారి విస్తరణ

తాడేపల్లిగూడెం: పెంటపాడు శివాలయం నుంచి తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వరకు గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన చేపట్టిన నాలుగు లైన్ల రహదారి విస్తరణలో భాగంగా మిగిలిన పనులకు నిధులు విడుదలయ్యాయి. వీటిని వినియోగించుకొని కోడేరు నల్లజర్ల రోడ్డులో రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉద్యానవర్సిటీ సమీపంలో తాడిపూడి కాలువపై ఉన్న వంతెనను నాలుగులైన్ల ర హదారి కోసం విస్తరిస్తున్నారు. పాత వంతెన రెయిలింగ్‌ను తొలగించి విస్తరిస్తున్నారు. గూడెం నుంచి నల్లజర్ల వైపునకు కుడి పక్కన వంతెన విస్తరణ ముగిసింది. రెండో వైపు పనులు సాగుతున్నాయి. ఈ పనుల కోసం 18 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్టు తెలిసింది.

ఆర్యవైశ్య ఉపాధ్యక్షుడిపై దాడికి నిరసన

ఉండి: ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కనిగల్ల బ్రహ్మానందంపై మంగళవారం సాయంత్రం కొందరు యువకులు దాడి చేశారు. ఈ దాడికి నిరసనగా బుధవారం సంఘ సభ్యులు ఉండిలో దుకాణాలను మూసివేసి నిరసన తెలిపారు. పత్రికా ప్రకటన ద్వారా సంఘ మండలాధ్యక్షుడు బొండాడ కేశవరావు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా నాయకుడు బ్రహ్మానందంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంగళవారం ఉండిలో మార్కెట్ సమయంలో కొందరు యువకులు మద్యం సేవించి ఆయనపై దాడికి పాల్పడ్డారన్నారు. ఈ ఘటనపై సంఘ సమావేశంలో సభ్యులతో చర్చించి తదుపరి కార్యాచరణ తెలియజేస్తామన్నారు.

గుండెపోటుతో సీసీఎస్ ఎస్సై మృతి

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం సీసీఎస్ ఎస్సైగా పని చేస్తున్న ఎ.నాగేశ్వరరావు మంగళవారం అర్ధ రాత్రి విధులు ముగించుకొని కారులో ఇంటికి వెళ్తుండగా గుండెపోటుతో మృతి చెందారు. విజయవాడకు చెందిన నాగేశ్వరరావు భీమవరం సీసీఎస్‌లో ఎస్సైగా పని చేస్తున్నారు. ఆయనకి భార్య పిల్లలు ఉన్నారు. ఎస్సై నాగేశ్వరావు మృతి పట్ల ఎస్పీ అజిత, పోలీసు అధికారులు సంతాపం తెలిపారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

ఇరగవరం: ప్రతి మహిళ వ్యాపారాలు చేస్తూ ఆర్థిక ప్రగతి సాధించాలని ఏపీఎం టి.పుష్పవతి అన్నారు. బుధవారం ఇరగవరం మహిళ సమైక్య భవనంలో వివోఏలకు శిక్షణ కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా సంఘల్లో ఉన్న ప్రతి సభ్యురాలు ఏదో ఒక వ్యాపారం చేయాలన్నారు. పేదరికం పోవాలి అంటే మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. సీసీలు గూడాల అనురాధ, సూర్యనారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ రాజు పాల్గొన్నారు.

డ్రెయిన్ పూడికతోనే నారుమళ్ల ముంపు

వ్యవసాయాధికారులు



నారుమడులు పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ సంధ్య, తదితరులు

ఉండి: మండలంలో ముంపునకు గురైన నారుమడులను వ్యవసాయాధికారులు ఏడీఏ కేఏఎస్ఎస్. శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారిణి బి.సంధ్య బుధవారం పరిశీలించారు. యండగండి మీడియం డ్రెయిన్ పూడిక పనులు చేపట్టకపోవడంతో ఉప్పులూరు, యండగండి, చిలుకూరు గ్రామాల్లో 350 ఎకరాలకు సరిపడా 17.5 ఎకరాల నారుమళ్లు ముంపునకు గురయ్యాయి. దీంతో వ్యవసాయాధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. నారుమడుల్లో నీరు బయటకు రాకపోవడంతో దెబ్బతింటున్నాయని డ్రెయిన్ పరిస్థితిని ఉన్నతాధికారులతో పాటు డ్రెయినేజ్ అధికారులకు కూడా తెలిజేస్తామని ఏడీఏ తెలిపారు. రైతులు నారుమడులు వేసుకునే సమయంలో మెరక భూములను ఎంచుకోవాలని అప్పుడు ముంపు సమస్య నుంచి సాధ్యమైనంత వరకు తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.మేఘన, ఎ.మహేంద్రి, టి.ఝాన్సీ, రైతులు పాల్గొన్నారు.

రచయిత అడబాల లక్ష్మీనారాయణకు సత్కారం



రచయిత అడబాల లక్ష్మి నారాయణను సత్కరిస్తున్న దృశ్యం


వీరవాసరం: పుస్తక రచయిత, దర్శకుడు అడబాల లక్ష్మీనారాయణ (రాజు)కు గౌరవ డాక్టరేట్ వచ్చిన సందర్భంగా వీరవాసరంలో బుధవారం ఘనంగా సత్కరించారు. సత్కార గ్రహీత రాజు మాట్లాడుతూ ప్రముఖ రచయిత, దర్శకుడు, నటులు తనికెళ్ల భరణి సలహా మేరకు, గురువు వర్ధినీడి సురేష్ కోరిక మేరకు రచించిన మా రాయకుదురు గ్రామ చరిత్రను ×చరిత్ర లో మా ఊరు× పుస్తకానికి ఊహించలేని గౌరవం దక్కిందని తెలిపారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు తెలుగు లిటరేచర్ (రీసెర్చ్) విభాగంలో గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిందన్నారు. గౌరవ డాక్టరేట్ పొందిన లక్ష్మి నారాయణను వీరవాసరం కళా పరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, కళారంజని అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాస్, శ్రీకృష్ణదేవరాయ నాటక కళా పరిషత్ కమిటీ, గ్రామ సర్పంచ్ గెద్దం భారతి, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామ చంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలో వర్షాలు కురుస్తున్నందున, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమలు అధికంగా ప్రభలే అవకాశం ఉందని, దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, దోమ తెరలు తప్పక వాడాలని పలు సూచనలు చేశారు. పట్టణ ప్రజలు నిల్వ ఉన్న, ఈగలు వాలుతున్న ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల జ్వరం, వాంతులు, విరోచనాలు వంటి అనారోగ్య సమస్యలు వస్తాయని, పట్టణ ప్రజలు ఎవరైనా కాలానుగుణ వ్యాధులకు గురైతే పురపాలక సంఘంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు తెలిపాలన్నారు. కాల్ సెంటర్ నెంబర్ 08818–224188ను సంప్రదించాలని కోరారు. కాచి చల్లార్చి, వడబోసిన నీటిని మాత్రమే తాగవలెనని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ బిల్లులు.. మారిన చెల్లింపులు

- ఏపీఈపీడీసీఎల్ సైట్‌లో చెల్లించే అవకాశం
- యూపీఐ యాప్‌లకు చెక్ పెట్టిన ఆర్బీఐ
- అందుబాటులోకి 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్



ప్రత్యక్ష చెల్లింపులు చేయాలని విద్యుత్ శాఖ సమాచారం

తణుకు: విద్యుత్ బిల్లులను ఇకపై సంస్థకే నేరుగా చెల్లించాలని ట్రాన్స్‌కో ప్రకటించింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఏపీఈపీడీసీఎల్ సైట్ లేదా ఈస్టర్న్ పవర్ యాప్‌లో మాత్రమే బిల్లు పేమెంట్ చేయాలని స్పష్టం చేసింది. యూపీఐ యాప్‌లైన గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ఇతరత్రా వాటిలో బిల్లు చెల్లించే ఆప్షన్‌ను నిలిపివేసి నట్లు వెల్లడించింది. విద్యుత్‌శాఖ కార్యాలయానికి నేరుగా వెళ్లి చెల్లిస్తే మేలని వినియోగదారులకు సూచిస్తోంది. సాధారణంగా విద్యుత్ బిల్లుల చెల్లింపునకు నిర్దేశిత గడువు తర్వాత కూడా యాప్‌లో చెల్లించే అవకాశం ఉంటోంది. ఇకపై ఇలా చేయడం కుదరదని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఆర్‌బీఐ భారత్ బిల్ పేమెంట్స్ మార్గదర్శకాల ప్రకారం నేరుగా యాప్ నుంచి చెల్లింపులను నిలిపివేశారు.

ఆర్‌బీఐ నిబంధనలు

సమయపాలన పాటిస్తూ గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి విద్యుత్ బిల్లులు చెల్లించే కాలం పోయింది. గతంలో కంటే ప్రస్తుతం ఆన్‌లైన్ వాడకం పెరిగింది. ఎల్‌టీ సర్వీసులు అధిక భాగం బిల్లులు మొత్తం ఆన్‌లైన్‌లోని యూపీఐ ద్వారా చెల్లిస్తున్నారు. మొదట్లో లావాదేవీలను ప్రోత్సహించాలని యాప్‌లో సర్వీసు చార్జీలు వసూలు చేసేవారు కాదు. కానీ, గత ఏడాది నుంచి నామమాత్రపు చార్జీలను యూపీఐ యాప్ నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. అయితే జూలై 1 నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులకు లైసెన్స్ అవసరమని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా యాప్‌ల యాజమాన్యాలు లైసెన్స్ పొందేందుకు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఆర్‌బీఐ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం బిల్ పేమెంట్ ఆప్షన్ తొలగించేశాయి.

కారణం ఇదీ..

ఆన్‌లైన్ చెల్లింపుల్లో మూడో పార్టీ యాప్స్ అయిన ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ఇతరత్రా వాటిలో కరెంటు బిల్లు చెల్లిస్తే విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడానికి మూడు రోజులు సమయం పడుతోంది. అలాగే కొన్ని పేమెంట్స్ పలు కారణాలతో నిలిచిపోతున్నాయి. దీంతో ప్రత్యక్షంగా విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడం ఆలస్యమవుతోంది. అదే ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో బిల్లు చెల్లిస్తే నేరుగా సంస్థ ఖాతాలోకే వస్తోంది. దీంతో యూపీఐ యాప్స్‌లో నగదు చెల్లించినా, నేరుగా ఏపీఈపీడీసీఎల్ ఖాతాలో జమ కావాలని ఆర్‌బీఐ నిబంధన విధించింది. అందులో భాగంగా యాప్స్ యాజమాన్యాలు పలు అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అవి పూర్తియ్యాక పాత విధానం అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ప్రస్తుతం గూగుల్‌ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న easternpower అనే యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని నేరుగా బిల్లులు చెల్లించుకోవచ్చు. వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలనుకుంటే www.apeasternpower.com ద్వారా పేమెంట్ చేసుకునే అవకాశం ఉంది.

80 శాతం ఆన్‌లైన్

తణుకు సబ్ డివిజన్‌పరిధిలోని అత్తిలి, ఇరగవరం, తణుకు రూరల్, తణుకు టౌన్, తణుకు డీ2 సబ్‌స్టేషన్ల పరిధిలోని దాదాపు 80 శాతం వినియోదారులు విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. సబ్ డివిజన్‌లో గృహ, వాణిజ్య సర్వీసులు దాదాపు 1.12 లక్షల వరకు ఉన్నాయి. ఇవి కాకుండా హెచ్‌టీ, పరిశ్రమల సర్వీసులు 418 వరకు వినియోగిస్తున్నారు. ఇవి కాకుండా 2,225 ప్రభుత్వ సర్వీసులు కాగా 1,263 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం విద్యుత్ బిల్లుల ద్వారా సబ్ డివిజన్‌లో నెలకు రూ. 30 కోట్లు వస్తోంది. ఇందులో రూ. 14.34కోట్లు గృహ, వాణిజ్యసర్వీసులు ద్వారా మిగిలిన రూ. 15 కోట్లు పరిశ్రమలు, హెచ్‌టీ సర్వీసుల ద్వారా వస్తోంది. పరిశ్రమల చెల్లింపులు బ్యాంకు ద్వారా చేస్తున్నారు. మిగిలిన వాటిలో 80 శాతం మంది ఆన్‌లైన్ ద్వారా కడుతున్నారు.

విద్యుత్ బిల్లులు ఇలా చెల్లించాలి

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) పరిధిలోని వినియోగదారులు విద్యుత్ బిల్లులను easternpower మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్ www.apeasternpower.com ద్వారా చెల్లించాలి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాల మేరకు ఇకపై వినియోగదారులు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంలతోపాటు ఇతర యూపీఐ యాప్స్ ద్వారా నేరుగా విద్యుత్ బిల్లులను చెల్లించే అవకాశం లేదు. వినియోగదారులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, వాలెట్, క్యాష్ కార్డుల ద్వారా కూడా విద్యుత్ బిల్లును చెల్లించవచ్చు.

– సీహెచ్ రామకృష్ణ, ఏడీఈ, తణుకు సబ్‌డివిజన్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛంద సేవా సంస్థలు అందజేసిన వివిధ రకాల మొక్కలను బుధవారం ఎంఈఓ హనుమ, పాఠశాల హెచ్ఎం మైనం సత్యనారాయణలు నాటారు. హనుమ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. మొక్కలను నాటడం, వాటిని పరిరక్షించడం తప్పనిసరిగా చేయాలని, అత్యధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షించుకునేందుకు, ఆక్సిజన్ లెవిల్స్ పెరిగేందుకు, మొక్కలు అవసరం ఎంతైన ఉందని, విద్యార్థులు ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

అత్తిలి: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఉమర్ ఆలీషా పీఠం కన్వీనర్ యర్రంశెట్టి పుల్లారావు అన్నారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం అత్తిలి రైల్వేస్టేషన్ రోడ్డులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీఠం సభ్యులు రెడ్డి వెంకటేశ్వరరావు, మారియ్య పాల్గొన్నారు.